క్లుప్తంగా

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ శ్రీరాములు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని పలువురు నిరుపేదలతో పాటు పారిశుధ్య కార్మికులకు పార్వతీపురం మన్యం జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. శీతాకాలం నేపథ్యంలో చలి నుంచి ఉపశమనం పొందేందుకు వీలుగా ఈ దుప్పట్లు అందజేస్తున్నామని రెడ్‌క్రాస్ చైర్మన్ మంచిపల్లె శ్రీరాములు తెలిపారు. భవిష్యత్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.

హెల్మెట్ తప్పనిసరి..



ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అమ్మన్నరావు

సీతంపేట: ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్సై వై. అమ్మన్నరావు సూచించారు. స్థానిక అడ్వంచర్ పార్క్ వద్ద శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మితిమీరిన వేగంతో ప్రయాణం చేయవద్దని సూచించారు. తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి..

జియ్యమ్మవలస: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ అనీష్ సూచించారు. మండలంలోని చింతల బెలగాం వద్ద పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. అటువైపుగా వచ్చే వాహనదారుల వాహనాలను ఆపి, వారి డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. ఎటువంటి ధ్రువపత్రాలు లేని వారికి అపరాద రుసుం విధిస్తామని హెచ్చరించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు వివరించారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని కోరారు.

గోకులాలు పూర్తి చేయండి..



నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గీతాంజలి

సీతంపేట: గోకులం నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.గీతాంజలి అన్నారు. మండలంలోని పీవీ ఈతమానుగూడలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా చేపడుతున్న గోకులం నిర్మాణాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దారపాడు, రోలుగుడ్డి, కోడిశ, మండ, తాలాడ, సోమగండి, హడ్డుబంగి గ్రామ పంచాయతీల పరిధిలో 17 గోకులాలు నిర్మిస్తున్నామన్నారు. పశువుల మూత్రం ట్యాంక్‌లోకి వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ విద్యాసాగర్, టీఏ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభకు భక్తుల పయనం



సభకు పయనమైన భక్తులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): విజయవాడలోని గన్నవరం విమానాశ్రయం సమీపంలో ఎస్ఎల్‌వీ లైలా గ్రీన్ మెడోస్ వద్ద ఆదివారం జరగనున్న హైందవ శంఖారావం సభకు కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల భక్తులు శనివారం కురుపాం నుంచి పయనమయ్యారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఆలయాల స్వయం ప్రతిపత్తి, రక్షణపై చర్చించడం జరుగుతుందని జెడ్పీటీసీ ఎ.కోటేశ్వరరావు తెలిపారు.

సీసీ కెమెరాల నిఘాలో వీరఘట్టం..

- పట్టణం చుట్టూ 50 కెమెరాల ఏర్పాటు
- నేరాల నియంత్రణకు ఉపయోగపడతాయి : పోలీసులు



వీరఘట్టంలో తన షాపు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పోలీసులకు చూపిస్తున్న వ్యాపారస్తుడు(ఫైల్)

వీరఘట్టం: పట్టణంలో ఎక్కడ ఏ దొంగతనం జరిగినా, తగాదా జరిగినా, ఆరుబయట మద్యం సేవించినా, మద్యం దుకాణాల వద్ద గలాటా చేసినా ఇట్టే కనిపెట్టేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఆకతాయిల ఆగడాలకు కళ్లెం వేసేందుకు వీరఘట్టం పట్టణం చుట్టూ ప్రజల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. వీరఘట్టం ప్రధాన రహదారిలో అంబేడ్కర్ జంక్షన్, తెలగవీధి జంక్షన్, గ్రోమోర్ జంక్షన్, స్టేట్‌బ్యాంక్ జంక్షన్, కాలేజీ సెంటర్‌తో పాటు ప్రగతి, మహర్షి హైస్కూల్స్ సమీపంలో, బీఎంఆర్ థియేటర్, టింబర్ డిపో, సీబీఎం వీధి, కిమ్మి రోడ్డు.. ఇలా వీరఘట్టం పట్టణానికి నలుమూలలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

50 కెమెరాల ఏర్పాటు..

దొంగతనాలను అరికట్టేందుకు, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించేందుకు వీరఘట్టం మేజర్ పంచాయతీలోని ప్రధాన రహదారిలో ఉన్న వ్యాపారులంతా తమ షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఇటీవల ఎస్సై జి.కళాధర్ సూచించారు. దీంతో స్పందించిన పాఠశాల యాజమాన్యాలు, వ్యాపారులు అంతా వీరఘట్టం పట్టణంలో 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కెమెరాల ఏర్పాటుకు గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజల నుంచి పూర్తి సహకారం లభించిందని ఎస్సై తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు వ్యాపారులు, ప్రజలకు సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరించినట్లు చెప్పారు. ఈ మేరకు పలువురు వ్యాపారులతో ఎస్సై కళాధర్ శనివారం మాట్లాడారు. ఎటువంటి సమస్యలున్నా.. అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా తమకు సమాచారం ఇవ్వాలన్నారు.



స్థానిక వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్సై కళాధర్

మందకొడిగా పత్తి కొనుగోళ్లు..

భామిని: రైతుల పోరాటంతో భామినిలో ఎట్టకేలకు ఏర్పాటైన పత్తి కొనుగోలు కేంద్రం రైతులకు పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదు. ఇప్పటికే ఈకేవైసీ చేసుకున్న రైతులు పండించిన పత్తినే సీసీఐ కొనుగోలు చేస్తోంది. వ్యవసాయ శాఖ నమోదు చేసిన.. ప్రభుత్వం గుర్తించిన భూముల్లో మాత్రమే పండించిన పత్తికి మాత్రమే గిట్టుబాటు ధర లభిస్తోంది. కొనుగోలు కేంద్రానికి పలువురు రైతులు శనివారం ట్రాక్టర్లతో భారీగా పత్తి తీసుకువచ్చారు. ఇదిలా ఉంటే ఈ కేంద్రంలో పత్తి విక్రయానికి కేవలం 95 మంది రైతులు మాత్రమే పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. పత్తి రైతులు ఈకేవైసీ చేసుకుని పత్తిని విక్రయించాలని అధికారులు చెబుతున్నారు. ముడిపత్తిని దళారులకు విక్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రంలో విక్రయించాలని రైతు సంఘ అధ్యక్షుడు బి.లక్ష్మీపతినాయుడు కోరారు.



కొనుగోలు కేంద్రానికి వచ్చిన ముడి పత్తి ట్రాక్టర్లు

‘సూర్యఘర్’పై అవగాహన

వీరఘట్టం: సోలార్ విద్యుత్‌తో విద్యుత్ బిల్లులు పొదుపు చేయవచ్చని ట్రాన్స్‌కో ఈఈ టి.గోపాలకృష్ణమూర్తి సూచించారు. శనివారం స్థానిక 33/11 కేవీ విద్యుత్ కార్యాలయం వద్ద వినియోగదారులకు ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1 నుంచి 5 కిలోవాట్స్ వరకు సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం రాయితీలు కల్పిస్తుందని చెప్పారు. సోలార్ రూఫ్ టాప్‌లు కావాల్సిన వారు విద్యుత్‌శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో డీఈఈ మోహన్ చక్రవర్తి, ఏఈ కె.అనిల్‌కుమార్, వెండర్లు, స్థానిక లైన్‌మన్‌లు పాల్గొన్నారు.



సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: తోటపల్లిలో కొలువైన శ్రీవేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాతసేవ, మంగళాశాసనం పూజలు అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. స్వామిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

- హెచ్‌ఎం మల్లేశ్వరరావు

వీరఘట్టం: మహిళా విద్య ఉద్యమ సిద్ధాంతకర్త, భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని హెచ్‌ఎం మల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని దశుమంతపురం పాఠశాలలో పూలే జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాస్తవానికి శుక్రవారం ఈ వేడుకలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ.. వీరఘట్టంనకు చెందిన ఓ మహిళా ఉపాధ్యాయురాలు మృతి చెందడంతో కార్యక్రమాన్ని వాయిదా వేయాల్సి వచ్చిందన్నారు. అనంతరం సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయురాలు బి.ఆదిలక్ష్మిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మజ్జి పైడిరాజు, శ్రీనివాసరావు, ప్రసాద్, రామకృష్ణారావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



దశుమంతపురం పాఠశాలలో మహిళా ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న సహచరులు

అంధుల అక్షరశిల్పి లూయీ బ్రెయిలీ



గుమ్మలక్ష్మీపురం(కురుపాం): లూయీ బ్రెయిలీ గొప్పతనం వివరిస్తున్న ఎంఈవో రాధాకృష్ణమూర్తి

అంధుల అక్షరశిల్పి లూయీ బ్రెయిలీ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది అంతా బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన చీకటి సూర్యుడు లూయీ బ్రెయిలీ అని, ఒక అంధుడైన బ్రెయిలీ.. అంధులకు అక్షర జ్ఞానం కల్పించేందుకు ప్రత్యేకంగా ఓ లిపి(చుక్కల లిపి)ని రూపొందించి, అందించారని వక్తలు కొనియాడారు. ఆయన చూపిన మార్గాన్ని అనుసరించి, ఇప్పుడు ఎంతోమంది అంధులు బాగా చదువుకుని, ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారన్నారు. అటువంటి మహనీయుల జీవిత చరిత్రను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు.

-పాలకొండ, కురుపాం నెట్‌వర్క్



గరుగుబిల్లి భవిత కేంద్రంలో బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న సిబ్బంది



పాలకొండ రూరల్: హడ్కో కాలనీ స్కూల్‌లో బ్రెయిలీ లిపి ఆవశ్యకతను వివరిస్తున్న హెచ్‌ఎం

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభం

పాలకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శనివారం నుంచి మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. డొక్కా సీతమ్మ పేరుతో నిర్వహించనున్న ఈ పథకాన్ని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ విద్యార్థుల సౌలభ్యం కోసం ఈ పథకం ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. ఈ పథకం ద్వారా పేద విద్యార్థులకు మేలు కలుగుతుందని వివరించారు. పథకం కోసం రూ. లక్ష విలువ చేసే వంట పరికరాలను అందించిన పల్లా కొండలరావు, విజయనిర్మలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గండి రామినాయుడు, వెలమల మన్మథరావు, గర్భాన సత్తిబాబు, వాకముడి అనిల్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇకనుంచి కళాశాల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందజేయడం జరుగుతుందని, దూర ప్రాంతాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థులకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డి.రామకృష్ణ, పి.సుదర్శనరావు, ఎస్.కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రిన్సిపాల్ సవరపు రవణ ప్రారంభించారు. విద్యార్థులంతా ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంఈవో-2 శ్రీనివాసరావు, ఏఎస్‌ఐ కాసులు, అధ్యాపకులు మహారాణా, ప్రధానోపాధ్యాయులు కె.ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: స్థానిక జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించి, విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.తిరుపతినాయుడు, ఎంఈవో జామి నారాయణస్వామి, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



డొక్కా సీతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ, తదితరులు



గుమ్మలక్ష్మీపురం: విద్యార్థికి భోజనం వడ్డిస్తూ పథకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

బ్యాంకు తీరుపై ప్రజా సంఘాల నిరసన

పార్వతీపురం టౌన్: రైతుల డబ్బులు వారికి ఇవ్వడానికి యూనియన్ బ్యాంకుకు ఆంక్షలేల? అని ప్రజా సంఘాల నాయకులు గొర్లి వెంకటరమణ ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం పట్టణంలో యూనియన్ బ్యాంకు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం, బెలగాం చర్చి దగ్గర ఉన్న యూనియన్ బ్యాంక్‌లో రైతుల ఖాతాలలో ధాన్యం డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం వేసిందన్నారు. పార్వతీపురం, బెలగాంలో గల యూనియన్ బ్యాంకు వారు డబ్బులు ఇవ్వడానికి రూల్స్ ఒప్పుకోవు, ఒక్క రోజుకి రూ.20వేల మాత్రమే ఇస్తాం, చెక్కు ఉంటేనే ఇస్తాం అంటు నిబంధనలు చెబుతున్నారన్నారు. చదువుకోని రైతులకు ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. అడిగితే మీరు ట్యాక్సులు కట్టాలని బెదిరిస్తున్నారని తెలిపారు. రైతుల అకౌంట్లలో డబ్బులు ఉన్న తీసుకోలేని పరిస్థితి ఉందన్నారు. బ్యాంక్ సిబ్బందిపై తగు చర్యలు తీసుకొని, రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, కద్రక రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

గరుగుబిల్లి: చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్ సూచించారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. పిల్లల బరువు, ఎత్తులు పరిశీలించడంతో పాటు వారి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సక్రమంగా అందించాలని తెలిపారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారికి సకాలంలో వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



చిన్నారుల ఆరోగ్యం పరిశీలిస్తున్న ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్

లక్ష్యాలను పూర్తి చేయాలి..

పాలకొండ రూరల్: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ డీఈఈ జి.రవి తెలిపారు. శనివారం స్థానిక హౌసింగ్ శాఖ కార్యాలయంలో ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ.. పీఎంఏవై 2.0 గృహ పథకానికి సంబంధించి ఇప్పటివరకు 3623 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇంకా అర్హత ఉన్న దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈఈ రవి

క్యాలెండర్ ఆవిష్కరణ..



ఏపీ ఎన్‌జీఓ సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ సంఘం గౌర అధ్యక్షుడు లిల్లీపుష్పనాథం, అధ్యక్షుడు కె. రంగాచారి, నాయకులు ఈశ్వరరావు, జి. నాయుడు, ఇన్‌చార్జ్ జో ప్రసాద్, సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. - పాలకొండ

నిబంధనలు పాటించాల్సిందే..



వాహనదారులు కచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందేనని ఎస్సై జి.కళాధర్ సూచించారు. వీరఘట్టం మండల కేంద్రంలోని సీఎస్పీ రోడ్డులో యు.వెంకమ్మపేట వద్ద శనివారం ఆయన వాహన తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. మితిమీరిన వేగంతో ప్రయాణాలు చేయవద్దన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులతో రాకపోకలు సాగించకూడదని సూచించారు. - వీరఘట్టం

అభినందనలు..



వీరఘట్టం మండలం కంబరవలస హైస్కూల్ విద్యార్థి ఎ. రుషి రూపొందించిన సైన్స్ ప్రాజెక్ట్ జిల్లా స్థాయిలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో విద్యార్థిని హెచ్‌ఎం వై.లక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది, ఎస్ఎంసీ సభ్యులు శనివారం ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. - వీరఘట్టం

మంచు దుప్పటి..



సీతానగరం మండలంలో పలుచోట్ల రెండు రోజులుగా మంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 9 గంటలైనా.. మంచు కురుస్తూనే ఉంది. మంచు దుప్పటి కప్పేస్తుండడంతో ప్రయాణం చాలా కష్టంగా మారుతోంది. ప్రజలు అత్యవసరమైతే తప్ప వాహనాలపై బయటకు రావడం లేదు. మరోవైపు అపరాల పంటకు నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. – సీతానగరం

గురుకుల విద్యార్థుల ప్రతిభ

కొమరాడ: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన జిల్లా యూత్ ఫెస్టివల్ పోటీల్లో స్థానిక గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు సందీప్, దిలీప్‌లు ప్రతిభ కనబరిచారు. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో సెన్సార్‌తో పనిచేసే ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్ ప్రాజెక్టు రూపొందించి, ప్రదర్శనగా ఉంచగా ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి వచ్చినట్లు ప్రిన్సిపాల్ డి.లక్ష్మణరావు శనివారం తెలిపారు. రూ.5 వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సదరు విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.



ప్రాజెక్టు ప్రదర్శనలో విద్యార్థులు